క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన జీడీకే–11గని సింగరేణి కార్మికుడు రాసపల్లి నాగరాజు కుటుంబాన్ని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్ శుక్రవారం పరామర్శించారు. ప్రమాద వివరాలు తెలుసుకున్నారు. బాధిత కుటుంబసభ్యులను ఓదార్చారు. నాయకులు కాల్వ లింగస్వామి, ఎండీ.ముస్తఫా తదితరులున్నారు.

మెరుగైన సేవలతోనే గుర్తింపు



రాములును సత్కరిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అడిషనల్ కలెక్టర్లు

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ శాఖల్లో పని చేసే అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి ప్రజలకు అందించే మెరుగైన సేవలతోనే గుర్తింపు లభిస్తుందని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. శుక్రవారం ఉద్యోగ విరమణ పొందిన ఆర్‌అండ్‌బీ ఈఈ రాములు, అటెండర్ మల్లేశంలను అడిషనల్ కలెక్టర్లు అరుణశ్రీ, శ్యాంప్రసాద్ లాల్‌లతో కలిసి సత్కరించారు. మల్లేశంకు పింఛన్ మంజూరు పత్రాలను అందజేశారు. అనంతరం రంగంపల్లిలో ఆర్‌అండ్‌బీ అధికారులు ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో జిల్లా అధికారులు, కాంట్రాక్టర్లు రాములును సన్మానించారు.

ఆలయ భూముల కౌలుకు బహిరంగ వేలం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ భూములను కౌలుకు ఇచ్చేందుకు ఈ నెల 3న ఆలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఈవో శంకరయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పెద్దపల్లిలోని 11.24 ఎకరాలు, బంధంపల్లిలోని 2.16 ఎకరాల భూమిని లీజుకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గలవారు బంధంపల్లిలోని భూమి కోసం రూ.10 వేలు, పెద్దపల్లిలోని భూమి కోసం రూ.50 వేలు ధరావతు చెల్లించి, వేలంలో పాల్గొనాలని సూచించారు.

భద్రాచలం, కొండగట్టు తరలివెళ్లిన దీక్షాపరులు



సుల్తానాబాద్ నుంచి వెళ్తున్న దీక్షాపరులు

సుల్తానాబాద్: పట్టణంలోని పలువురు హనుమాన్ దీక్షాపరులు శుక్రవారం వాహనాల్లో భద్రాచలం, కొండగట్టు ఆలయాలకు తరలివెళ్లారు. అంతకుముందు మార్కండేయ కాలనీ, పూసాల, శాస్త్రీనగర్ హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. వారికి ఫ్రూట్స్, డ్రైఫ్రూట్స్, వాటర్ బాటిళ్లను యువ సంకల్ప ఫౌండేషన్ చైర్మన్ తుమ్మ రాజ్‌కుమార్, సభ్యుడు రఫిక్ అందించారు.

పోగొట్టుకున్న ఫోన్ అప్పగింత



రామగిరి: సెంటినరీకాలనీ జేఎన్టీయూ కళాశాలకు చెందిన విద్యార్థి పర్రె దిలీప్‌కుమార్ తన ఫోన్ పోయిందని సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసు సిబ్బంది ఆ ఫోన్‌ను వెతికి, శుక్రవారం బాధితుడికి అందజేశారు. సీఈఐఆర్ పోర్టల్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎవరికైనా ఫోన్లు, ఇతర విలువైన వస్తువులు దొరికితే సమీప ఠాణాలో అప్పగించాలన్నారు.

మామిడితోట దగ్ధం

ఓదెల: ఓదెల గ్రామంలో అల్లం సతీశ్ అనే రైతుకు చెందిన నాలుగెకరాల మామిడితోట శుక్రవారం సాయంత్రం ప్రమాదవశాత్తు నిప్పంటుకొని, దగ్ధమైంది. ఈ ఘటనలో రూ.4 లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం పరిహారం అందించి, ఆదుకోవాలని కోరాడు.

ఆర్ఎఫ్‌సీఎల్ బాధితులకు పూర్తి డబ్బులివ్వాలి

ఫెర్టిలైజర్‌సిటీ: ఆర్ఎఫ్‌సీఎల్ కర్మాగారంలో ఉద్యోగాల పేరిట మోసపోయిన బాధితులకు దళారులు 40 శాతం డబ్బులే చెల్లించి, చేతులు దులుపుకున్నారని ఫైట్ ఫర్ బెటర్ సొసైటీ అధ్యక్షుడు మద్దెల దినేశ్ ఒక ప్రకటనలో ఆరోపించారు. ఉద్యోగాల కుంభకోణంలో నష్టపోయిన వారిలో ముగ్గురు ఆత్మహత్య చేసుకున్నారని పేర్కొన్నారు. బాధితుల వద్ద వసూలు చేసిన రూ.18 కోట్లతో మాజీ ఎమ్మెల్యేతోపాటు దళారులు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ప్రత్యేక చొరవ తీసుకొని, ఆర్ఎఫ్‌సీఎల్ బాధితులకు పూర్తి డబ్బులు అందేలా చూడాలని కోరారు.

ప్రభుత్వ తీరుపై రైతుల్లో అసంతృప్తి

- జెడ్పీటీసీ సభ్యురాలు కందుల సంధ్యారాణి
- సాదాసీదాగా పాలకుర్తి మండల సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యురాలు సంధ్యారాణి

పాలకుర్తి: గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ తన మేనిఫెస్టోలో వరి ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లిస్తామని ప్రకటించి, ఇవ్వలేదని పాలకుర్తి జెడ్పీటీసీ సభ్యురాలు కందుల సంధ్యారాణి అన్నారు. దీంతో ప్రభుత్వ తీరుపై రైతుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోందని పేర్కొన్నారు. శుక్రవారం పాలకుర్తి మండల సర్వసభ్య సమావేశం మండల పరిషత్ సమావేశ మందిరంలో సాదాసీదాగా కొనసాగింది. కొత్త ఎంపీపీగా గంగాధర రమేశ్ బాధ్యతలు స్వీకరించిన రెండు రోజులకు జరిగిన ఈ సమావేశం నిర్ణయించిన సమయాని కంటే దాదాపు 45 నిమిషాలు ఆలస్యంగా ప్రారంభమైంది. వివిధ విభాగాల మండల స్థాయి అధికారులు తమ ప్రగతి నివేదికను చదివి, వినిపించారు. ప్రస్తుతం పచ్చి రొట్ట విత్తనాల్లో జనుము అందుబాటులో లేవని, జీలుగ మాత్రమే ఉన్నాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ప్రకాశ్ కోరారు. ఎంపీపీ రమేశ్ మాట్లాడుతూ.. జనుము విత్తనాలను సైతం అందుబాటులో ఉంచాలన్నారు. జయ్యారం ఎస్సీ బాలికల వసతిగృహం మూసివేశారని, తిరిగి తెరిపించేందుకు చర్యలు తీసుకోవాలని వార్డెన్ సంపత్‌కుమార్‌కు సూచించారు.

జిల్లా కేంద్రానికి బస్సులు నడిపించాలి

మండల పరిధిలోని గ్రామాలను కలుపుతూ గోదావరిఖనికి బస్సు సౌకర్యం ఉందని, పెద్దపల్లి జిల్లా కేంద్రానికి కూడా ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సులు నడిపించాలని ఎంపీపీ ఆర్టీసీ అధికారులను కోరారు. జెడ్పీటీసీ సభ్యురాలు సంధ్యారాణి మాట్లాడుతూ.. గ్రామాల్లో చాలామంది వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు పెన్షన్ల కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని, అలాంటి వారిని గుర్తించి గ్రామస్థాయిలోనే సమస్య పరిష్కారమయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎంపీపీ రమేశ్ మాట్లాడుతూ.. ప్రస్తుత సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టామని, ఆగస్టు 15 నుంచి రైతులకు రుణమాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన నేపథ్యంలో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోందని పేర్కొన్నారు. వైస్ ఎంపీపీ ఎర్రం స్వామి, బసంత్‌నగర్, కొత్తపల్లి, ఎల్కలపల్లి ఎంపీటీసీ సభ్యులు పాత భాగ్యలక్ష్మి, ప్రియాంక, సతీశ్, తహసీల్దార్ జ్యోతి, ఎంపీడీవో శశికళ, ఎంపీవో షబ్బీర్‌పాషా, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు విజయ, సువర్ణ, మండల పశువైద్యాధికారి జునైద్‌ఖాన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందినవారికి సన్మానం







చంద్రపాల్, అనిల్‌కుమార్, వెంకటమోహన్‌లను సత్కరిస్తున్న సింగరేణి అధికారులు, ఎన్టీపీసీ ఈడీ కేదార్ రంజన్ పాండు, సింగరేణి జీఎం సూర్యనారాయణ

గోదావరిఖని/యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి రామగుండం డివిజన్–3 ఓసీపీ–1లో ఈపీ ఆపరేటర్‌గా 37 ఏళ్లపాటు విధులు నిర్వహించి, ఉద్యోగ విరమణ పొందిన చంద్రపాల్‌ను సంస్థ అధికారులు, కార్మికులు శుక్రవారం గోదావరిఖనిలో సన్మానించారు. ఆయన క్రీడాకారులకు స్ఫూర్తి, కళా కెరటం అని కొనియాడారు. ప్రాజెక్టు అధికారి రాధాకృష్ణ, గని మేనేజర్ ఉదయ్ హరిజన్ మాట్లాడుతూ.. చెప్పిన పని ఎంత కష్టమైనదైనా, క్రమశిక్షణతో రక్షణ సూత్రాలు పాటిస్తూ, నైపుణ్యంతో చేయగలిగిన కార్మికుడు చంద్రపాల్ అన్నారు. హాకీ, లాన్ టెన్నిస్ క్రీడాకారుడిగా, హాస్య కళాకారుడిగా సింగరేణికి కోలిండియా స్థాయిలో పతకాలు తీసుకువచ్చారని పేర్కొన్నారు. యువ కార్మికులు ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. గని సంక్షేమాధికారి సాయికృష్ణ, రక్షణాధికారి కూరపాటి శ్రీనివాస్, యూనియన్ నాయకులు వైవీ.రావు, తిరుపతి, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

దేహదానానికి అంగీకారం

మరణానంతరం తన దేహాన్ని మెడికల్ కాలేజీకి దానం చేస్తానని చంద్రపాల్ ప్రకటించారు. సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి ఆయనను అభినందించారు. చంద్రపాల్‌ను ఆదర్శంగా తీసుకొని, నేత్ర, దేహదానానికి ప్రతిఒక్కరూ ముందుకురావాలని కోరారు.

ఎన్టీపీసీ రామగుండం సంస్థలో..

జ్యోతినగర్: ఉద్యోగ విరమణ ప్రతీ ఉద్యోగికి సహజమని ఎన్టీపీసీ రామగుండం–తెలంగాణ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండు అన్నారు. ఎన్టీపీసీ రామగుండం సంస్థలో ఉద్యోగ విరమణ పొందిన జనరల్ మేనేజర్ అనిల్‌కుమార్ వేముల, ఉద్యోగి జానిమియాలను శుక్రవారం సన్మానించారు. వారి తర్వాతి జీవితం కుటుంబసభ్యులతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. జనరల్ మేనేజర్లు, ఏజీఎం(హెచ్‌ఆర్) బిజయ్‌కుమార్ సిగ్దర్, ఉద్యోగ గుర్తింపు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ వేముల కృష్ణయ్య, ప్రధానకార్యదర్శి ఆరెపల్లి రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరిఖని: సింగరేణి రామగుండం డివిజన్–1 జీఎం కార్యాలయ ఆడిట్ విభాగంలో డీజీఎంగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన నామని రాజంను శుక్రవారం జీఎం చింతల శ్రీనివాస్ సన్మానించారు. జీఎం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రామ్మోహన్, ఏజీఎం పర్సనల్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే, ఆర్జీ–2 ఏరియాలో క్వాలిటీ అడిషనల్ మేనేజర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన వెంకటమోహన్‌ను సత్కరించారు. జీఎం కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీజీఎం పర్సనల్ రాజేంద్రప్రసాద్, సివిల్ డీజీఎం ధనుంజయ, ఐఈడీ డీజీఎం మురళీకృష్ణ తదితరులున్నారు.

కనీస వేతనాల అమలుకు కృషి చేయాలి



మినిమమ్ వేజ్‌బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

రామగిరి: కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు అమలుకు కృషి చేయాలని ఐఎన్‌టీయూసీ ఆర్జీ–3 డివిజన్ వైస్ ప్రెసిడెంట్ కోట రవీందర్ రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం రాత్రి సెంటినరీకాలనీలో మినిమమ్ వేజ్ బోర్డు చైర్మన్ జనక్‌ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఆర్జీ–3 పరిధిలోని ఓసీపీ–2 బెల్ట్ కార్మికులకు సెమీ స్కిల్డ్ వేతనాలు అమలయ్యేలా చూడాలన్నారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లగా యాజమాన్యంతో మాట్లాడి, పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఐఎన్‌టీయూసీ కాంట్రాక్టు కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ఉడుత శంకర్, కాంట్రాక్టు కార్మిక సంఘం జిల్లా జనరల్ సెక్రటరీ బండ కిరణ్ రెడ్డి, కార్మికులు శ్రీనివాస్, రాజేశం, భూమయ్య, రమేశ్, రాయమల్లు ఉన్నారు.

‘మానేరు ఇసుకను తరలిస్తే ఊరుకోం’



సురేశ్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

ఓదెల: జిల్లాలో మానేరు ప్రాంత ఇసుకను అక్రమంగా తరలిస్తే ఊరుకోబోమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గొట్టిముక్కుల సురేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఓదెలలో ఆయనకు ఆత్మీయ సన్మాన సభ జరిగింది. ఆయన మాట్లాడుతూ.. పెద్దపల్లిలో కొందరు ప్రజాప్రతినిధులు, నాయకులు చాలెంజ్ వేసి, తొడగొట్టి, తడిబట్టల స్నానాలతో మానేరు ఇసుక అక్రమ రవాణాపై మాట్లాడారని పేర్కొన్నారు. ఇసుక రవాణాతో భూగర్భజలాలు తగ్గిపోయి, పంట సాగు అగమ్యగోచరంగా మారిందన్నారు. ఇసుక తరలింపును నిలిపివేయాలని కోరుతూ చెన్నైలోని ఎన్‌జీటీలో కేసు వేశామని, సుప్రీంకోర్టు కంటే కఠినంగా తీర్పు వచ్చిందని తెలిపారు. నాయకులు సదాశివరెడ్డి, కుమార్, నర్సింహాచారి, సతీశ్, రజనీకర్, కొంరయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓసీపీల్లో నీరు నిలవకుండా చూడాలి



క్వారీని పరిశీలిస్తున్న డైరెక్టర్ సత్యనారాయణ

గోదావరిఖని: రాబోయే వర్షాకాలంలో ఓసీపీల్లో నీరు నిలవకుండా చూడాలని సింగరేణి ఈఅండ్ఎం డైరెక్టర్ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం సంస్థ రామగుండం డివిజన్–2 ఓసీపీ–3 ప్రాజెక్టును సందర్శించారు. వ్యూపాయింట్ నుంచి క్వారీని పరిశీలించారు. భారీ వర్షాలకు క్వారీలో నీరు నిల్వకుండా ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించి, ఉత్పత్తి లక్ష్యాలను రక్షణతో సాధించాలన్నారు. ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ.సూర్యనారాయణ, అధికారులు మధుసూదన్, ఇంజినీర్ నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి ఉచిత యోగా శిక్షణ తరగతులు

గోదావరిఖని: పారిశ్రామిక ప్రాంత ప్రజల ఆరోగ్యం కోసం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సంఘం అధ్యక్షుడు వెనిశెట్టి నటరాజశేఖర్ తెలిపారు. శుక్రవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నుంచి 20వ తేదీ వరకు గోదావరిఖని ఆర్యవైశ్య భవన్‌లో ప్రతీరోజు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఉచిత యోగా క్లాసులు ఉంటాయన్నారు. కూచిపూడి డాన్స్, కోలాటం, కరాటేలో కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పిస్తాం

గోదావరిఖని: పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామని జీపీపీపీజీ అధ్యక్షుడు గుడిసెల భీమ్‌సేన్, ప్రధాన కార్యదర్శి ఎరుకల నాగరాజు అన్నారు. శుక్రవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నూతన కార్యవర్గంలో తమతోపాటు ఉపాధ్యక్షులుగా నూనె శరత్, మద్దెల శ్రీనివాస్, కోశాధికారిగా బోడ సమ్మయ్య, సోషల్ మీడియా సెక్రటరీలుగా మేకల శ్రీకాంత్, బోయిని రాజశేఖర్‌లను నియమించినట్లు పేర్కొన్నారు. కోదండ రామాలయం ప్రాంగణంలో ఉన్న 39 గుంటల స్థలానికి ఫెన్సింగ్ తొలగించిన విషయమై మున్సిపల్‌లో కలిసి, మాట్లాడామన్నారు. జరిగిన పొరపాటును గుర్తించి, వెదురు మొక్కలతో ఫెన్సింగ్ ఏర్పాటుకు అంగీకరించారని పేర్కొన్నారు. సమావేశంలో గంజి మురళీకృష్ణ, పోతుల నరేశ్, పి.శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

‘అభివృద్ధికి అడ్డుపడుతున్న జెడ్పీ చైర్మన్’



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

రామగిరి: మంత్రి శ్రీధర్‌బాబు, ఆయన సోదరుడు శ్రీనుబాబుపై చేసిన అనుచిత వ్యాఖ్యలను జెడ్పీ చైర్మన్ పుట్ట మధు ఉపసంహరించుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తోట చంద్రయ్య, సీనియర్ నాయకుడు తీగల సమ్మయ్య అన్నారు. శుక్రవారం నాగెపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సింగరేణి నిర్వాసిత గ్రామం నాగెపల్లిలో రోడ్డు విస్తరణలో భాగంగా దుకాణాలను తొలగిస్తే జెడ్పీ చైర్మన్ గగ్గోలు పెడుతున్నారని, గ్రామ అభివృద్ధికి అడ్డు పడుతున్నారని ఆరోపించారు. మంథని నియోజకవర్గంలో గత పదేళ్ల ప్రజలను భయభ్రాంతులకు, బెదిరింపులకు గురిచేసిన చరిత్ర బీఆర్ఎస్ నాయకులదేనన్నారు. పదేళ్ల తర్వాత మంత్రి శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో ప్రజాపాలన సాగుతోందని పేర్కొన్నారు. యూత్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు బర్ల శ్రీనివాస్, నాయకులు తులసీరాం గౌడ్, రాజ్‌కుమార్, రామ్మూర్తి, సందీప్, రామస్వామి, రాజమౌళి తదితరులున్నారు.

‘రోడ్డు విస్తరణను అడ్డుకునేందుకు కుట్రలు’

కమాన్‌పూర్: మంథని–పెద్దపల్లి ప్రధాన రహదారి విస్తరణలో భాగంగా రామగిరి మండలంలోని నాగేపల్లి వద్ద జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను అడ్డుకునేందుకు జెడ్పీ చైర్మన్ పుట్ట మధు కుట్రలు చేస్తున్నారని కాంగ్రెస్ కమాన్‌పూర్ మండల అధ్యక్షుడు వైనాల రాజు ఆరోపించారు. మండల కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధిలో భాగంగానే రోడ్డు విస్తరణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు. జెడ్పీ చైర్మన్‌తోపాటు మరికొంత మంది రాజకీయ లబ్ధి కోసమే మంత్రి శ్రీధర్‌బాబుపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. మరోసారి ఇలా చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. నాయకులు చొప్పరి శేఖర్, బూస తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు రండి



ఏర్పాట్లు పరిశీలిస్తున్న జీఎం సుధాకర్‌రావు

రామగిరి: ఆదివారం నిర్వహించే తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు సింగరేణి ఉద్యోగులు, వారి కుటుంబసభ్యులు, పరిసర ప్రాంతాల ప్రజలు అధిక సంఖ్యలో రావాలని ఆర్జీ–3 జీఎం ఎన్.సుధాకర్‌రావు కోరారు. సెంటనరీకాలనీ రాణీ రుద్రమదేవి క్రీడా ప్రాంగణంలో వేడుకల ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ పి.ఏలీషా, ఎస్‌వోటూ జీఎం రఘుపతి, సివిల్, ఫారెస్ట్ డీజీఎంలు పద్మరాజు, బి.కర్ణ, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, ఏరియా సెక్యూరిటీ అధికారి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ‘ఉపాధి’ జాబ్‌కార్డులివ్వాలి



గంగారంలో కూలీలతో మాట్లాడుతున్న తహసీల్దార్ జాహెద్ పాషా

కాల్వశ్రీరాంపూర్: అర్హులైన ఉపాధిహామీ కూలీలందరికీ జాబ్‌కార్డులివ్వాలని తహసీల్దార్, గంగారం పంచాయతీ ప్రత్యేక అధికారి జాహెద్ పాషా ఫీల్డ్ అసిస్టెంట్ శంకర్‌ను ఆదేశించారు. ప్రతిఒక్కరూ వంద రోజులు పని చేసి, పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎండల తీవ్రత నేపథ్యంలో పనులు చేస్తున్న సమయంలో విధిగా తలకు రుమాలు ధరించాలని, వడదెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వడదెబ్బ తగిలితే బాధితులకు వెంటనే ఓఆర్ఎస్ తాగించాలని, సమీపంలోని ఆస్పత్రికి తరలించి, వైద్యం అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో మంజుల, పంచాయతీ కార్యదర్శి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

బడీడు, బడి మానేసిన పిల్లలను గుర్తించండి



ఎలిగేడులో సమావేశమైన అధికారులు

ఎలిగేడు: మండలంలోని 12 గ్రామాల్లో బడీడు, బడి మానేసిన పిల్లలను గుర్తించి, పాఠశాలల్లో చేర్పించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీవో భాస్కర్‌రావు అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో బడిబాట కార్యక్రమం, అమ్మ ఆదర్శ పాఠశాలల పనులపై సమావేశం నిర్వహించారు. ఈ నెల 3వ తేదీ నుంచి 19 వరకు చేపట్టే బడిబాటలో హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు, వీవోలు పాల్గొనాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులను స్కూళ్లు ప్రారంభమయ్యేలోగా పూర్తి చేయాలన్నారు. స్కూల్ కాంప్లెక్స్ హెచ్ఎం దేవేందర్‌రావు, ఎంఎన్‌వో నరేంద్రాచారి, ఏపీఎం సుధాకర్, హెచ్ఎంలు తదితరులున్నారు.

సుల్తానాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో చేపడుతున్న పనులు ఈ నెల 4వ తేదీలోగా పూర్తి కావాలని ఎంపీడీవో దివ్యదర్శన్‌రావు అన్నారు. శుక్రవారం తన కార్యాలయ సమావేశ మందిరంలో హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. 3వ తేదీ నుంచి 19 వరకు బడిబాట నిర్వహించాలని, ప్రతీ పాఠశాలలో 10 శాతం విద్యార్థులను చేర్చేలా అంగన్వాడీ టీచర్లు, ఆశవర్కర్లు, మహిళా సంఘాల సభ్యుల సహకారం తీసుకోవాలని సూచించారు. నోడల్ ఆఫీసర్ దివాకర్, హెచ్ఎం రత్నాకర్ రెడ్డి, సీఆర్పీ కిరణ్‌గౌడ్ తదితరులున్నారు.

రామగిరి: ఈ నెల 3వ తేదీ నుంచి 19 వరకు నిర్వహించే బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో శైలజారాణి అన్నారు. శుక్రవారం పన్నూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులను విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు. హెచ్ఎంలు, వీవోలు, మండల మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

కాల్వశ్రీరాంపూర్: బడిబాట కార్యక్రమంలో భాగంగా కాల్వశ్రీరాంపూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీడీ రామ్మోహనాచారి శుక్రవారం ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. బడీడు పిల్లలను సర్కారు బడుల్లో చేర్పించాలని కోరారు.

కాంట్రాక్టు కార్మికులకు లాభాల్లో వాటా ఇవ్వాలి



గోదావరిఖని: సింగరేణి అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సంస్థ లాభాల్లో వాటా ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోకల రమేశ్ కోరారు. శుక్రవారం సింగరేణి సీఎండీ బలరాంకు వినతిపత్రం అందజేశారు. సంస్థలో 53 విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు చాలీచాలని వేతనాలతో అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. లీవులు, పండుగ సెలవులు వంటి కనీస హక్కులు కూడా అమలు కావడం లేదని పేర్కొన్నారు. నాయకులు పులిపాక రాజేందర్, ఎర్రల సారయ్య, మహేశ్ పాల్గొన్నారు.

నేడు హనుమాన్ జయంతి



కాల్వశ్రీరాంపూర్: పెగడపల్లి పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో శనివారం హనుమాన్ జయంతి మహోత్సవం నిర్వహిస్తున్నట్లు టీటీడీ ధర్మ ప్రచార పరిషత్ ధర్మాచార్యులు నరెడ్ల సదానందం తెలిపారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో సంబంధిత బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఉదయం అభిషేక పారాయణం జరుపుతామని, టీటీడీ పుస్తకాలు, తిరుమల తిరుపతి ప్రసాదాలను భక్తులకు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ రమణా రెడ్డి, రెడ్డి సంఘం చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి తదితరులున్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



తెలుకుంట హైస్కూల్ పూర్వ విద్యార్థులు



టెంపరరీ టౌన్‌షిప్ హైస్కూల్ పూర్వ విద్యార్థులు

జూలపల్లి: మండలంలోని తెలుకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002–03 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు శుక్రవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి వారు చదువుకున్న పాఠశాలే వేదికైంది. 20 ఏళ్ల తర్వాత చిన్ననాటి మిత్రులను చూసి, సంతోషం వ్యక్తం చేశారు. తరగతి గదిలో చేసిన అల్లరిని గుర్తు చేసుకొని, నవ్వుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడి సందడిగా గడిపారు.

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం టెంపరరీ టౌన్‌షిప్‌లోని హైస్కూల్లో 1995–96 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు శుక్రవారం ఒక్కచోట చేరారు. తమ స్కూల్లోనే పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకున్నారు. 28 ఏళ్ల తర్వాత చిన్ననాటి మిత్రులను చూడటంతో భావోద్వేగానికి లోనయ్యారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. తమ తరగతి గదులు, ఆడుకున్న ఆట స్థలంలో చాలాసేపు కలిసి తిరిగి, పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో రహీం, తోట కుమారస్వామి, పులి వెంకట్, ఎం.శ్రీనివాస్‌గౌడ్, ఎస్.స్వామి, మధు, ఈర్ల రాయమల్లు, సమ్మయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.